క్లుప్తంగా

223 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

విజయనగరం: నగరంలోని 13వ డివిజన్ కొత్తపేట, యాదవ వీధిలో శనివారం స్వామి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. 223 మందికి డాక్టర్ మంచు కుమార స్వామి, సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. తీవ్రమైన నేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి శస్త్రచికిత్సలు చేస్తామని చెప్పారు. ప్రగతి స్వచ్ఛంద సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ పి.కనకమహాలక్ష్మి ప్రారంభించారు.

నాణ్యమైన బియ్యం సరఫరాకు డిమాండ్



గాజులరాగ ఉన్నత పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: మధ్యాహ్న భోజన పథకానికి నాసిరకం బియ్యం సరఫరా చేయడంతో బిర్యానీ, పులిహోర, పరమాన్నం, ఆకుకూర అన్నం వండేందుకు నిర్వాహకులకు కత్తిమీద సాములా మారిందని, నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. పలు పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. బియ్యం ఎంత చెరిగి వండినా బియ్యంలో పట్లు ఉంటున్నాయన్నారు. ఈ బియ్యంతో వండిన అన్నం తిన్న పిల్లలు అనారోగ్యానికి గురైతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. భోజన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుడితి ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి పండగ



అమ్మవారి గద్దె వద్ద నిర్వహించిన పూజల్లో నాయకులతో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో యాదవులు గంగమ్మ తల్లి(గావు) పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు యాదవ కులస్తులు తప్పెట గుళ్లతో స్వాగతం పలికారు. స్థానికుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, నాయకులు గెద్ద దాలినాయుడు, వెంకటరమణ ఫణీంద్రుడు, చిరంజీవి, మురళీ, సత్యనారాయణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ



సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో ఆంజనేయపురంలో సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ పనులను మేజర్ పంచాయతీ విద్యుత్ సిబ్బంది శనివారం చేపట్టారు. మెయిన్‌రోడ్‌లో సిటీకేబుల్ కార్యాలయం వద్ద ప్రారంభమయ్యే డివైడర్‌లో సెంటర్ లైటింగ్ పోల్‌ను రెండు రోజుల కిందట కారు ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. విరిగిపోయిన స్తంభం స్థానంలో మేజర్ పంచాయతీ విద్యుత్ సిబ్బంది కొత్తది ఏర్పాటు చేయడంతో పాటు లైట్లను అమర్చారు.

చలివేంద్రాల ప్రారంభం



గుర్ల పెట్రోల్ బంక్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గుర్ల: వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు మండ లంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి పెంటోజీరావు తెలిపారు. మండల కేంద్రంలోని మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీడీఓ శేషుబాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నారాయణమ్మతో కలిసి శనివారం ప్రారంభించారు. ఆర్‌ఐలు అప్పల రాజు, దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, చందక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

- పింఛన్ల పంపిణీ కోసం కొత్త స్కానింగ్ యంత్రాలు
- విజయనగరం కార్పొరేషన్‌కు 469 యూనిట్ల పంపిణీ

ప్రాంతం: విజయనగరం కార్పొరేషన్

మొత్తం డివిజన్‌లు : 50

పింఛను లబ్ధిదారులు: 22,735

పంపిణీ చేయాల్సిన మొత్తం: రూ.9.91 కోట్లు

ఇబ్బందులు తీరేనా?



పింఛన్ల పంపిణీ కోసం నూతనంగా వచ్చిన వేలిముద్రల స్కానర్

విజయనగరం: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో సాంకేతిక ఇబ్బందులు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సిబ్బందిని సైతం ముందుకు వెళ్లకుండా చేస్తున్నాయి. ఈ సమస్యను గట్టెక్కించేందుకు అధికారులు కొత్తగా అధునాతన వేలిముద్ర (ఎంఎఫ్‌ఎస్ 110, ఎల్–1 ఫింగర్ ప్రింట్) స్కానర్లను విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గల వార్డు సచివాలయాలకు సమకూర్చారు. వీటితో అయినా ఏప్రిల్ నెల నుంచి పింఛన్ల పంపిణీ కష్టాలు తీరుతాయోలేదోనన్న బెంగ లబ్ధిదారులను వెంటాడుతోంది.

విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. పాత బయోమెట్రిక్ పరికరాలతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేలిముద్రలు సరిగా పడక కొంతమంది లబ్ధిదారులు పింఛన్ అందుకునేందుకు అవస్థలు పడుతున్నారు. సచివాలయాల చుట్టూ రెండు, మూడు సార్లు తిరిగి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా వృద్ధుల వేలిముద్రలు పడకపోవడం ... తరచూ స్కానర్లు మరమ్మతులకు గురవుతుండటం.. సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగకపోవడంతో అటు లబ్ధిదారులు.. ఇటు సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. వేలిముద్రలు పడనివారికి అధికారుల ప్రత్యేక అనుమతితో సిబ్బంది తర్వాత పింఛను డబ్బులు అందించాల్సి వస్తోంది. కొత్త ఎల్–1 వేలిముద్ర స్కానర్లతో వేలిముద్రల నమోదు సమస్య గట్టెక్కుతుందని టీపీఆర్వో సింహాచలం అభిప్రాయపడ్డారు. సచివాలయ సిబ్బంది కొత్తగా అందించిన వేలిముద్ర స్కానర్లతోనే ఏప్రిల్ నెల పింఛన్లు అందజేస్తారని తెలిపారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్



విజయనగరంలో సీపీఐ రాజకీయ ప్రచార జాత

విజయనగరం గంటస్తంభం: బీజేపీ, దాని అనుబంధ కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి బుగత అశోక్ పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా విజయనగరం నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ దుందుడుకు, విధ్వంసకర విధానాల వల్ల శ్రామికుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ఆర్థిక అసమానతలు అత్యంత ప్రమాదకరంగా పెరుగుతున్నాయన్నారు. భారతదేశ బడ్జెట్ సంపన్న వర్గాలకు రాయితీలు ఇచ్చేదిగా మారిందన్నారు. ప్రజారోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల రంగానికి ఆశించిన స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు లేవని ఆరోపించారు. సర్దార్ భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ రాజకీయ ప్రచార జాతను ప్రారంభిస్తున్నామని, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకు కొనసాగబోయే ప్రచార కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పొందూరు అప్పలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, కెల్ల సూర్యనారాయణ, పతివాడ శ్రీనివాసరావు, మజ్జి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్నుల వసూలు

విజయనగరం: ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసినట్టు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డీ రాయితీ వినియోగించుకునేందుకు ఈనెల 31వ తేదీతో గడువు ముగియనుందన్నారు. ఆస్తి పన్ను వసూళ్ల కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 31న రంజాన్ పండగ సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రజలంతా విషయాన్ని గమనించాలని కోరారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం...



చైతన్య ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో అధికారులు,నాయకులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: ఆపదలో ఉన్న వారికి తమవంతు సహాయం అందించి అండగా నిలిచేందుకు రోడ్డు ప్రమాదంలో చనిపో యిన తమ కుమారుడు చైతన్య పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేశామని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమంది అప్పా రావు తెలిపారు. మండల కేంద్రంలో చైతన్య ఫౌండేషన్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా అప్పా రావు మాట్లాడుతూ ఎలాంటి ఆధరణలేని కుటుంబాలతో పాటు, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి, గ్రామాన్ని అభి వృద్ధి చేయడానికి సంస్థపరంగా కృషి చేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, జెడ్పీటీసీ ప్రతినిధి మహంతి జనార్దనరావు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ వానపల్లి వెంకటరావు, ఎస్‌బీఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ కె.సత్యనారాయణ, పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతురావు, హెచ్‌ఎం బి.శంకరరావు, ఎంపీటీసీ పి. లక్ష్మునాయుడు, సర్పంచ్ టొంపల సీతారాం,మా జీ సర్పంచ్ సన్యాసి నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మహంతి లక్ష్మణరావు, రౌతు సత్తిబాబు, కప్పల రామారావు, చైతన్య ఫౌండేషన్ ప్రతినిధులు వంకా లక్ష్మి, ఐ.యువకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు,రేపు యథావిధిగా సేవలు

నెల్లిమర్ల: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండగ ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని సబ్‌రిజిస్ట్రార్ కొవ్వూరు రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఈ రెండు సెలవు దినాల నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు మినహాయింపు ఇస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సేవలందిస్తామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా కెల్ల త్రినాథ్

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం మండలాధ్యక్షునిగా కెల్ల త్రినాథ్ నియామకమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ నియామకాన్ని చేపట్టినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పోక్సో చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా కోర్టు న్యాయమూర్తి పద్మావతి

నెల్లిమర్ల: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం మహిళా కోర్టు న్యాయ మూర్తి ఎస్.పద్మావతి విద్యార్థినులకు పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తిస్తే ముందుగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలికల రక్షణ కోసం 2012లో పోక్సో చట్టం చేశారని చెప్పారు. బాలల హక్కులను కాపాడడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలియజేశారు.18 ఏళ్లలోపు బాల,బాలికలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వారికి చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో గౌరవంగా మెలగాలని, నైతిక విలువలు అలవరచుకోవాలని సూచించారు. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని చెప్పారు. బాలల హక్కుల ఫోరం జిల్లా కన్వీనర్ పి. చిట్టయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఎస్.చిట్టిబాబు, ఎస్‌ఐ బి.గణేష్, కేజీబీవీ ఎస్‌ఓ బి.ఉమ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి రమణ

పూసపాటిరేగ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రమణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మారుమూల ఇళ్లకు సైతం తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నీటి సరఫరాను పర్యవేక్షించాలని చెప్పారు. ఎంపీడీఓ ఎం.రాధిక, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది మార్కెట్



ఉగాది పూజాసామగ్రి కొనుగోలుదారులతో విజయనగరం గంటస్తంభం, పాతబస్టాండ్ మార్కెట్‌లు శనివారం రద్దీగా మారాయి. అరటిపండ్లు, టెంకాయలు, మామిడికాయల ధరలు చుక్కలనంటాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

విజయనగరం అర్బన్: విజయనగరం కంటోన్మెంట్‌లోని గురజాడ పాఠశాలలో శనివారం 'గ్రాడ్యుయేషన్ డే'ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చల్లా భవానీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్, టీవీల చూడడాన్ని తగ్గించాలన్నారు. లేదంటే చదువుపై ఆసక్తి సన్నగిల్లుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ కరెస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు.

ముగిసిన దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు



నెల్లిమర్ల: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు



పూసపాటిరేగ: దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: వెనుకబడిన తరగతుల యువతీ యువకుల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. మొత్తం 366 యూనిట్లకు 2,820 దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం హాజరైన 1,011 మంది, శనివారం 656 మంది దరఖాస్తుదారుల అర్హత పత్రాలు పరిశీలించామన్నారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు శనివారం పంచాయతీల వారీగా 650 మంది దరఖాస్తులను పరిశీలించామని ఎంపీడీఓ ఎం. రాధిక తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది రవికుమార్, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి స్థానిక బైరెడ్డి సూర్యనా యణ కల్యాణ మండపంలో నగరపంచాయతీ కమిషనర్ అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరపంచాయతీలోని 20 వార్డుల నుంచి 439 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 335 మంది హాజరయ్యా. అభ్యర్థుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సీఎంఎం దన్నాన గోవింద, బీసీ కార్పొరేషన్ ప్రతినిధులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లిలో డీఎస్పీ కార్యాలయం

- ఇంతవరకు గరివిడిలో ఉన్న కార్యాలయం
- కొద్ది రోజుల క్రితమే చీపురుపల్లికి మార్చిన అధికారులు



చీపురుపల్లిలోని వెంకటేశ్వరనగర్‌లో డీఎస్పీ కార్యాలయం

చీపురుపల్లి: సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(డీఎస్పీ) కార్యాలయం చీపురుపల్లికి చేరింది. సబ్ డివిజన్ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న చీపురుపల్లిలోనే డీఎస్పీ కార్యాలయం ఉండాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు గరివిడిలో నిర్వహించారు. కొద్ది రోజుల క్రితమే చీపురుపల్లిలోని విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వెంకటేశ్వరనగర్‌లోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. ఇక నుంచి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఎనిమిది మండలాల పౌరులు, పోలీస్ సిబ్బంది డీఎస్పీ కార్యాలయం పని నిమిత్తం గరివిడి వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయాలన్న గొప్ప ఆశయంతో 2023లో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటయ్యాయి. రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగానే సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం, డీఎల్‌డీఓ వంటి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే అప్పట్లో అధికారులు డీఎస్పీ కార్యాలయాన్ని గరివిడిలో ప్రారంభించారు. ఇంతవరకు అక్కడే కార్యకలాపాలు సాగించారు. ప్రస్తుతం డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలో కార్యాలయాన్ని చీపురుపల్లి హెడ్‌క్వార్టర్స్‌కు మార్చారు. అద్దె భవనంలో పూర్తిస్థాయిలో సదుపాయాలు లేవు. పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో ఖాళీ స్థలం ఉన్నందున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే డీఎస్పీ కార్యాలయానికి సొంత భవనాలు నిర్మించుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీస్ క్వార్టర్స్, అక్కడి ఖాళీ స్థలాన్ని కొద్ది నెలల క్రితమే జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు.